# హాస్యవల్లరి

2015





శ్రీ

## కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 148






## కామెడీ క్లబ్ కథలు

**మల్లాది వెంకటకృష్ణమూర్తి**

**వయసులో ఉన్న** ఓ అమ్మాయి ఏ పెళ్ళికెళ్ళినా ఆమె బామ్మ , ఆమెవంక చూసి నవ్వుతూ "తర్వాత నువ్వే నువ్వే.." అనసాగింది.

అది ఆమెకి ఎంతో కోపాన్ని తెప్పించసాగింది. అలా అనవద్దని చెప్పినా బామ్మ వినడంలేదు.

ఓ రోజు ఎవరిదో చావుకి వెళ్ళిందా అమ్మాయి.

అక్కడున్న బామ్మని చూసి గట్టిగా చెప్పిందా అమ్మాయి..

"తర్వాత నువ్వే.. తర్వాత నువ్వే.."

ఆ తర్వాత  పెళ్ళిళ్ళలో ఆ అమ్మాయిని చూసినా బామ్మ "తర్వాత నువ్వే" అనడం మానేసింది.

# చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

**పల్లెటూరి రైతు** అప్పుడే పట్నం నుంచి వచ్చిన గోపీతో అన్నాడు

"మాకు వాతావరణం విశేషాలు తెలుసుకోడానికి రేడియోలు, టివిల్లాంటి వేమీ అవసరం లేదు తెలుసా?"

"అంటే..?"

"ఉదాహరణకి.. వర్షం వస్తుందో రాదో తెలుసుకోవాలంటే మా పశువుల్ని చూస్తే చాలు.."

"ఎలా?"

"పశువులు నిల్చుని ఉంటే వర్షం రాబోతోందని అర్థం. పశువులు పడుకుని ఉంటే వర్షం రాదని అర్థం.."

"మరైతే అక్కడ కొన్ని పశువులు నిల్చుని ఉన్నాయి, మరికొన్ని పడుకుని ఉన్నాయి.. ఇప్పుడేమంటారు..?"

"అంటే.. వర్షం వస్తే రావొచ్చు.. లేకపోతే లేదన్నమాట..!"

❀❀

**ఒక కవిశేఖరుడు** తెలుగు మాస్టారొకాయన్ని ఇంటికి పిలిచి

"మాస్టారూ.. నా కవితలు విని అభిప్రాయం చెప్పరా?" అని కవితలు ఒకదాని తర్వాత ఒకటి చదవడం మొదలుపెట్టాడు.

వింటున్న తెలుగు మాస్టారు నిద్రలోకి జారుకుని గురకపెట్టసాగారు..

కవిశేఖర్ ఆయన్ని తట్టిలేపి

"అదేంటి మాస్టారూ.. కవితలమీద అభిప్రాయం చెప్పమంటే గురకపెడుతున్నారు?"

"గురకపెట్టడం కూడా అభిప్రాయమే నాయనా..!"

❀❀

**లెక్కలమాస్టారు** బుడుగుని అడిగారు

"బుడుగూ.. నీదగ్గర ఆరు యాపిల్స్ ఉన్నాయనుకో. అందులో నేను మూడు అడిగితే ఇంకా ఎన్ని మిగులుతాయి?"

"ఆరు సార్.."

"అదేంటిరా.. ఆరులో మూడు తీసేస్తే మిగిలేది మూడు కదా.."

"మీరు మూడు యాపిల్స్ అడిగారు కానీ, నేను ఇస్తే కదసార్... నేను ఇవ్వను కాబట్టే నా దగ్గర ఆరే ఉంటాయి..."

❀❀

**"ఏమండీ..**నాకు వయసొచ్చాక కూడా ఇలానే ప్రేమిస్తారు కదూ..!?" కొత్తగా పెళ్ళయిన కమల రవిని అడిగింది.

"ఓ తప్పని సరిగా..! ఇంతకంటే ఎక్కువగా ప్రేమిస్తాను. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను, ఎంత వయసొచ్చినా సరే. అన్నట్టు వయసొచ్చాక నువ్వు మీ అమ్మలా తయారవ్వవు కదా..!? "

❀❀

**"ఏమిటి** జంబులింగం గారూ... వేలికి కట్టుకట్టారు?"

"ఆ.. ఏం లేదండీ. నిన్న సిగరెట్ తీసుకోబోతుంటే ఎవడో వెధవ చెయ్యి తొక్కాడు."

❀❀

**"మాది చాలా** అన్యోన్యమైన దాంపత్యమోయ్.." జంబులింగం మిత్రుడు అప్పారావుతో అన్నాడు.

"ఆహా.. ఎలా చెప్పగలవు?"

"నేను నిద్రపోయేప్పుడు భయంకరంగా గురకపెడతాను. మా ఆవిడకి బ్రహ్మాచెముడు..!"

❀❀

**"నేను పాతికేళ్ళు** వచ్చేదాకా పెళ్ళిచేసుకోను.." అబ్బాయి చెప్పాడు.

"నాకైతే పెళ్ళయేదాకా పాతికేళ్ళు రావు.." అమ్మాయి బదులిచ్చింది.

❀❀

**"ఎందుకలా పౌడరూ,** స్నో రాసుకుంటున్నావమ్మా?" ఆరేళ్ళ సీగాన పెసూనాంబ అమ్మని అడిగింది.

"ఇలా స్నో , పౌడరూ రాసుకుంటే మొహం అందంగా కనిపిస్తుంది.."

మేకప్ అయ్యాక అమ్మని చూస్తూ అంది సీగాన పెసూనాంబ

"అమ్మా.. ఆ స్నో , పౌడరూ.. సరిగా పనిచెయ్యడం లేదనుకుంటాను.."

❀❀

**రైలు ప్రయాణంలో** ఎదురుపడిన జంబులింగాన్ని ఎవరో అపరిచితుడు పలకరించాడు..

"అవునండీ.. మిమ్మల్ని ఏదో వూళ్ళో చూశానండీ. గుర్తు రావడం లేదండీ."

"చూసే ఉంటారు లెండి. నేను చాలా రోజులుగా ఏదో వూళ్ళొనే ఉంటున్నా.." జంబులింగం సమాధానమిచ్చాడు.

❀❀

**"జ్ఞాపకశక్తి** పెరగడానికి మందుతీసుకుంటున్నావట గదా.. ఏమైనా గుణం కనిపించిందా?"

"ఆఁ.. కనిపించింది. కొంతనయమే.. ఏదో మరిచిపోయినట్టు అప్పుడప్పుడు జ్ఞాపకమొస్తుంది, అదేదో జ్ఞాపకం రాకపోయినా..!"

❀❀

**"ఏరా... బుడుగూ..** మీనాన్న గారు ఇంట్లో ఉన్నారా?"

బుడుగు లోపలికి వెళ్ళివచ్చి " మా నాన్నగారు ఇంట్లో లేరని చెప్పమన్నారండీ.."

"అయితే నేను రాలేదని చెప్పు.."

❀❀

**బార్బర్‌షాపులో** గడ్డం గీయించుకుంటూ " ఆగాగు.. గాట్లు పెట్టేస్తున్నావ్.." కంగారుగా అన్నాడు జంబులింగం.

"భయపడకండి సార్.. మా షాపులో గాటుకి అర్థరూపాయి చొప్పున రిబేటు ఇస్తాము. ఇప్పుడే ఒకాయన 20 రూపాయలు పుచ్చుకుని వెళ్ళాడు.."

❀❀

**అప్పారావు** మిత్రుడు సుబ్బారావుతో "ఏమయ్యా.. ఆ రామారావ్ నెలకి పాతికవేలు సంపాదిస్తాడు. ఐనా ఎప్పుడు డబ్బులు లేవని ఏడుపే.."

"ఎందుకు ..నీకేమైనా బాకీ ఉన్నాడా?"

"లేదు.. నేనే అతన్ని అప్పు అడుగుదామని.."

❀❀

**కమల:** "ఈ మగవాళ్ళు వాళ్ళల్లో వాళ్ళు ఏం మాట్లాడుకుంటారో.."

విమల: "ఆడాళ్ళు మాట్లాడుకునేవే వాళ్ళు మాట్లాడుకుంటారనుకుంటాను.."

కమల: "ఛీ.. అసహ్యం..! "

❀❀




## కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

**ఒకతనికి** గుర్రాల పిచ్చి. చీరాల్లో అందరూ స్కూటర్లమీదా, సైకిల్ రిక్షాలమీదా తిరుగుతుంటే ఇతగాడు గుర్రం స్వారీచేస్తూ తిరిగేవాడు.

ఓ జాకీ గుర్రాన్ని అమ్మబోతున్నాడని తెలియగానే అతనా జాకీ దగ్గరకి వెళ్ళి గుర్రాన్ని చూశాడు. అది ఎంతో అందంగా, అద్భుతంగా ఉంది. బేరం కుదిరాక చెప్పాడు జాకీ, ఆ గుర్రం పేరు గాడ్ అని.

"ఈ గుర్రానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇంగ్లీష్ లో మాట్లాడితే అర్థం చేసుకుంటుంది గుర్రం నడవాలంటే 'గో గాడ్' అనాలి. ఆగాలంటే 'స్టాప్ గాడ్' అనాలి"

"గుర్రం వేగంగా పరిగెత్తాలంటే ఏం మాట్లాడాలి?" అడిగాడతను.

"థాంక్‌గాడ్ అంటే చాలు" వివరించాడతను.

గుర్రాన్ని కొన్నాక జాకీ చెప్పిందాంట్లో ఎంత నిజం ఉందా అని పరీక్షించదలిచాడు. గుర్రాన్ని ఎక్కి ;గో గాడ్' అన్నాడు. అది నడవసాగింది. 'స్టాప్ గాడ్' అనగానే అది ఆగింది. 'థాంక్ గాడ్' అనగానే ఇంకా వేగంగా పరిగెత్తసాగింది. అకస్మాత్తుగా దారిలో కొండా అంచు క్రింద పెద్దలోయ కనబడింది. వెంటనే అతను 'స్టాప్ గాడ్' అని అరిచాడు. గుర్రం ముందు కాళ్ళు సరిగ్గా కొండ అంచుకి చేరుకోగానే ఆగిందది. భయంతో పట్టిన చెమటని తుడుచుకుని చెప్పాడు అతను తలెత్తి ఆకాశం వంకచూసి

"థాంక్ గాడ్" అన్నాడు.

గుర్రంతో సహా ఆయన ఆ లోయలో పడి మరణించాడు.

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

పెంటయ్య తనురాసిన నవలని పరిశీలనకి ఒక పత్రికాఫీసులో ఇచ్చాడు. దాని సంగతి ఏమైందో తెలుసుకుందామని పత్రికాఫీసుకి వెళ్ళాడు.

"నేను రాసిన నవల నచ్చిందాండీ?"

"నవల సంగతి అలా ఉంచి, మేము పెద్ద పేరున్న రచయితల నవలలే వేద్దామనుకుంటున్నాం" ఎడిటర్ చెప్పాడు.

"పోనీ కలం పేరు 'విశ్వనాథ సత్యన్నారాయణ' అని పెట్టుకుంటానండీ..!"

⁂

"భార్యామణీ.. లాటరీ కొట్టాను. ఈ దెబ్బతో మన అప్పులన్నీ తీరిపోతాయి..!"

"అబ్బా.. ఎంత మంచి వార్త చెప్పారండీ..! ఐతే ఇంచక్కా మనం కొత్త అప్పులు చేసుకోవచ్చు!!"

⁂

డాక్టర్ పరబ్రహ్మానికి ఫోన్ వచ్చింది..

"డాక్టర్ గారూ.."

"అవునండీ.. నేనే మాట్లాడుతున్నా.."

"అర్జంటుగా మందు కావాలండీ.."

"దేనికి?"

"కడుపులో ఒకటే మంటలు.."

"దానికి మందు ఎందుకండీ.. హాయిగా ఓ బకెట్ చల్లనీళ్ళు తాగండి.. కడుపులో మంటలవే చల్లారిపోతాయి..!"

⁂

"అదేమిటమ్మా వదినా! నేను ఆవిడతో చెప్పొద్దని నీతో చెప్పిన విషయాన్ని నువ్వు ఆవిడతో చెప్పావని ఆవిడ నాతో చెప్పిందే!?"

"అది కాదొదినా! నేను ఆవిడతో చెప్పినట్లు నీతో చెప్పొద్దని ఆవిడతో చెప్పానే!"

"సరే.. పోనీలే.. ఎవర్నని ఏమి లాభం, ఆవిడ నాతో చెప్పిందని నేను నీతో చెప్పినట్లు నువ్వు మళ్ళీ ఆవిడతో చెప్పకు..!"

ꕥꕥ

ఆరోగ్యం గుండ్రాయిలా ఉన్నా కానీ, ఎప్పుడు ఏదో ఒక జబ్బు ఉందని పదేపదే తన దగ్గరకి వస్తున్న అప్పారావుతో డాక్టర్ పరబ్రహ్మం చెప్పాడు చివరిసారిగా...

"ఇదో.. అప్పారావ్.. బ్లడ్ టెస్ట్ చేయిద్దాం.. ఏమీ తేలకపోతే నాలుగైదు ఎక్స్ రేలు తీద్దాం, అప్పటికీ తేలకపోతే బోడీ స్కానింగ్ తీయిద్దాం, అప్పటికీ ఏమీ తెలీకపోతే భగవంతుడి మీద భారం వేద్దాం.. సరేనా!?"

ꕥꕥ

"ఏరా..బుడుగూ.. క్లాసు జరిగేప్పుడు మాట్లాడొద్దని ఎన్నిసార్లు చెప్పానూ?"

"అబ్బే నేను మాట్లాడ్లేదు సార్.. నాకు నిద్రపోయేప్పుడు మాట్లాడే అలవాటు అస్సలు లేదండీ.."

ꕥꕥ

పార్కులో ఎదురైన ఓ బక్కప్రాణిని పలకరించాడు జంబులింగం..

"ఏమోయ్ నీ పేరేమిటీ..?"

"గాంధీ అండీ.."

" నీ పేరెక్కడో విన్నట్లుందే."

"వినే ఉంటారండీ.. నేను చాలా ఏళ్ళుగా ఈ పార్కులో మొక్కలకి నీళ్ళు పెడుతుంటానండీ.."

ꕥꕥ

"అవునూ.. నీకు పరిచయం లేని ఆడవాళ్ళతో మాట్లాడ్డం ఎక్కువ అలవాటనుకుంటా.."

"ఔనోయ్.. నాకు పరిచయమున్న ఆడవాళ్ళయితే నాతో అసలు మాట్లాడనే మాట్లాడరు..!"

"డాక్టర్ గారూ.. ఈ జబ్బేమిటో తగ్గుతుందంటారా? ఎవరో చెప్పారు ఓ డాక్టర్ గారు న్యుమోనియాకి మందిస్తే పేషెంట్లు టైఫాయిడ్ తో చచ్చిపోయేవాళ్ళట..!"

"నాన్సెన్స్.. నాదగ్గర అలాంటి పొరబాట్లు జరగవండీ... నేను న్యుమోనియాకి మందిస్తే న్యుమోనియాతోనే చనిపోతారు. రోగం మారే ప్రసక్తే లేదు..!"

అప్పుడే జైలుకి వచ్చిన ఖైదీకన్నయ్యని జైలర్ అడిగాడు..

"కన్నయ్యా.. నువ్వు ఫోర్జరీ చేసి బ్యాంకులో లక్షలు కొట్టేశావనే కేసు లోజైలుకి వచ్చావు. ఇక్కడ ఖైదీలంతా ఏదో ఒక పనిచెయ్యాలి. నువ్వు ఏం పని ఎంచుకుంటావ్?"

"ఒక్క వారం సమయం ఇచ్చారంటే మీ సంతకాలన్నీ నేను పెట్టేస్తానండీ.."

కోర్టులో కేసు చర్చ రసకందాయంలో ఉంది.

డిఫెన్స్ లాయర్ బోనులో ఉన్న అప్పారావుని అడుగుతున్నాడు..

"సుబ్బారావు నిన్నేదో అన్నాడంటున్నావ్.. ఏమన్నాడో చెబుతావా?"

"పచ్చి బూతు మాటలు అన్నాడు సార్.. అవన్నీ ఇక్కడ అందరిముందూ చెప్పలేను.."

"పోనీలే.. ఐతే జడ్జిగారి చెవిలో చెప్పు.."

పుట్టింటి నుంచి వస్తూ తన తల్లిని వెంటబెట్టుకొచ్చిన భార్యతో

" అదేమిటోయ్.. మీ అమ్మని తీసుకురావొద్దని ఫోన్ చేసి చెప్పానుగా?" అన్నాడు జంబులింగం.

"అదే. ఆ విషయం తేల్చుకుందామనే మా అమ్మ వచ్చింది..!"




## కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

**బార్‌లో బిల్లు చెల్లించాక** ఓ తాగుబోతు వెయిటర్‌కి టిప్పు ఇవ్వబోతూ అడిగాడు.

"ఇంతదాకా నీకు ఎవరయినా సరే టిప్‌గా యిచ్చిన అతిపెద్ద మొత్తం ఎంత?"

"వందరూపాయలండీ.." జవాబు చెప్పాడా వెయిటర్.

ఆ తాగుబోతు వెంటనే వెయిటర్ చేతిలో నూటయాభై రూపాయలుంచి చెప్పాడు.

"ఇంకోసారి ఎవరయినా ఈ ప్రశ్న అడిగితే నూటయాభై రూపాయలు నేను ఇచ్చానని చెప్పు. అర్థమయిందా?"

తలూపాడు ఆ వెయిటర్.

లేచి బయటికి వెళ్ళబోతూ అడిగాడు ఆ తాగుబోతు, వెయిటర్‌ని.

"ఇంతకీ ఆ వందరూపాయలు టిప్ ఇచ్చింది ఎవరు?"

"మీరేనండీ.." జవాబు చెప్పాడా వెయిటర్.

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"**అవునోయ్** జంబులింగం.. నువ్వేమో ఆ శంభులింగాన్ని ఎప్పుడూ పొగుడుతుంటావ్. అతనేమో నిన్ను మాత్రం ఎప్పుడూ తిడుతూనే ఉంటాడు.."

"బహుశా మేమిద్దరమూ పొరబడుతున్నామనుకుంటాను.."

❀❀

"ఇదో..అప్పారావ్ చూడవయ్యా. గవర్నమెంట్ నుంచి ఐదుకోట్ల కాంట్రాక్ట్ కొట్టాను. తెలుసా?"

"ఇదేం నమ్మదగ్గదిగా లేదే."

"కావలిస్తే చూసుకో! వాళ్ళు ఆర్డర్స్ కేన్సిల్ చేస్తూ వ్రాసిన కాగితాలు."

❀❀

రెండురోజుల పెళ్ళికి తాయారమ్మగారు ఉన్న బట్టలన్నీ ఆరు పెట్టెలూ, రెండు బెడ్డింగుల్లో సర్దింది. బండెడు సామానూ ప్లాట్‌ఫారం మీద పెట్టించి ఇంటాయన

"తాయారూ.. భోషాణం కూడా తీసుకురావల్సింది.." అన్నాడు.

ఆవిడ చూపులతోనే కొట్టినంత పనిచేసింది.

"వేళాకోళం కాదు తాయారూ.. రైలు టిక్కెట్లు భోషాణం మీద వదిలేసి వచ్చాం."

❀❀

"అదేమిటోయ్ జంబులింగం.. మొహం నిండా బ్యాండేజీలేమిటి?" ఆఫీసర్‌గారు అడిగారు.

"రాత్రి మా ఆవిడతోటి గొడవయ్యిందండీ.."

"మరి మీ ఆవిడ వూర్నుంచి రావడానికి రెండు రోజులు పడుతుందన్నావు కదా.."

"నేనూ అలాగే అనుకున్నానండీ.."

❀❀

మ్యూజియం సందర్శిస్తున్న మంత్రిగారికి ప్రాచీనశిల్పాలు చూపిస్తున్నారు.

"అయ్యా.. ఇది మూడువేల యేళ్ళనాటిది.."

మంత్రిగారు తన సెక్రటరీ వైపు తిరిగి "నోట్ చేసుకోవయ్యా.. వీళ్ళు డబ్బులన్నీ ఇలా పాతవి కొనడానికి తగలేస్తున్నట్టున్నారు, లేకపోతే మనం ఉన్నది 21వ శతాబ్దంలో ఐతే మూడువేల నాటివి ఇక్కడ వుంచాడు. వీళ్ళ గ్రాంటు రద్దు చెయ్యమని గవర్నమెంట్‌కి లెటర్రాద్దాము."

ఆ మధ్య చార్మినార్ పైకి ఎక్కినపుడు చేతిగడియారం జారి కిందపడింది. ఉరుకులు పరుగులతో కిందికి దిగివచ్చి చూద్దునుకదా, భూమికి మూడు అడుగుల పైన ఆగిపోయి ఉంది.."

"ఏముందీ.. కీ ఇవ్వడం మర్చిపోయి ఉంటావు.."

మంత్రిగారి ఎన్నికల్లో గెలవడానికి బాగా సహాయం చేసిన ఒకాయన వచ్చి ఏదైనా ఉద్యోగం వేయించమని అడిగాడు.

"ప్రస్తుతానికి ఉద్యోగాలేం లేవయ్యా.. ఐనా ఫరవాలేదులే. ఉద్యోగాలు ఎందుకు లేవో పరిశీలించడానికి ఓ కమిటీని వేసి దానికి నిన్ను అధ్యక్షుడిగా వేస్తానులే.." అని హామీ ఇచ్చారు సదరు మంత్రిగారు.

బుడుగు బళ్ళో చేరినరోజు, ఓ గంట కూర్చున్న తర్వాత భోరున ఏడ్చేశాడు. మేష్టారు పరామర్శించారు.

"పధ్నాలుగేళ్ళు వచ్చేదాకా ఇలాగే రోజూ ఇక్కడ కూర్చోవాలి కదా అని ఏడుపొచ్చిందండీ.." అన్నాడు బుడుగు.

"నీకేం నాయనా.. నాకైతే అరవయ్యేళ్ళ దాకా ఇది తప్పదు కదా." అంటూ కళ్ళంబట నీళ్ళు పెట్టుకున్నాడు మేష్టారు.

ఒకాయన కంగారుగా ఫోన్ తీసి 2626 డయల్ చేశాడు." హల్లో 2626 యేనా?" అని అడిగాడు.

"కాదు.. ఇది 2627"

"పోన్లెండి గానీ మీ పక్కింట్లో డాక్టర్ గారుంటారు. కాస్త ఆయన్ని అర్జంటుగా మా యింటికి రమ్మని చెప్పాలి.."

❀❀

"ఆవిడ కెన్నేళ్ళుంటాయంటావ్?"

"అసలు యాభై. నలభై ఏళ్ళ దానిలా కనిపిస్తుంది. ముప్ఫయ్యేళ్ళని తను అనుకుంటుంది. ఇరవయ్యేళ్ళదానిలా ముస్తాబు చేసుకుంటుంది. పదేళ్ళ పిల్లలా ప్రవర్తిస్తుంది."

❀❀

జంబులింగం పేపర్ చదువుతూ భార్యతో అన్నాడు..

" చూశావటోయ్.. ఈ వ్యాసంలో వ్రాశారు - తండ్రి ఎంత తెలివైన వాడైతే కొడుకు అంత శుంఠ అవుతాట్ట.."

"అయితే మన అబ్బాయికేం ఫరవాలేదన్న మాట..!" భార్య తృప్తిగా నిట్టూర్చింది.

❀❀

ఇంట్లో వాటాని అద్దెకడిగిన ఆసామీతో ఇంటి యజమాని

"మీకు పెంపుడు కుక్కలున్నాయా?" అన్నాడు.

"లేవండి.. ఏం?"

"ఏం లేదు.. మాకు నాలుగున్నాయి. అవి అస్తమానం మొరుగుతూ ఉంటాయి. వాటితోనే ఛస్తున్నాం. ఇహ మీక్కూడా ఉంటే భరించలేం. అందుకని..!"




## కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

**ముగ్గురు** సరదాగా చేపలు పట్టడానికి ఓ చెరువుకి వెళ్ళారు. ముగ్గురూ పట్టిన చేపల్లో ఒకటి దేవతాకన్య. తనని విడిచిపెడితే ముగ్గురూ కోరే మూడు కోరికలు తీరుస్తానంది.

మొదటివాడు తన మేథస్సుని రెట్టింపు చేయమన్నాడు. అందుకామె ఒప్పుకుని ఆ కోరికని తీర్చింది.

ఇది చూసి రెండోవాడు తన మేథస్సుని మూడింతలు చేయమని కోరాడు. అందుకు కూడా ఆమె ఒప్పుకుని అతని కోరిక తీర్చింది.

మూడోవాడు తన మేథస్సుని నాలుగింతలు చేయమని కోరాడు. అయితే ఈ సారి దేవతాకన్య అతని కోరిక తీర్చకుండా ఇంకేదైనా కోరుకోమని చెప్పింది.

"నా కదే కావాలి.." పట్టుబట్టాడతను.

"నీ మంచికే చెప్తున్నాను. అది తప్ప ఇంకేదైనా కోరుకో.." చెప్పిందామె.

"అహ.. నువ్వు నాకోరిక తీర్చకపోతే నిన్ను వదలను.."

ఆమె ఎంత వద్దన్నా అతను వినకపోవడంతో ఆమె చిన్నగా నిట్టూర్చి "సరే.. నీ కోరిక తీరు గాక.!" అన్నది.

వెంటనే మూడోవాడు అమ్మాయిగా మారిపోయాడు..!!

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

**తల్లి** తీరిగ్గా స్నో, పౌడరు రాసుకుంటుంటే ఐదేళ్ళ కూతురు చూస్తూ కూచుంది.

"ఎందుకమ్మా..అవి రాసుకోవడం?" అని కూతురు అడిగింది.

"అవి రాసుకుంటే అందంగా ఉంటారు" అంది తల్లి.

ముస్తబంతా అయ్యాక తల్లికేసి చూసి "ఉహుం.. ఆ  స్నో, పౌడరుమంచివి కావేమో.." అంది కూతురు.

❀❀

**ఫస్టుక్లాస్** కంపార్ట్‌మెంట్‌లో ఇద్దరు పెద్ద మనుషులు ప్రయాణం చేస్తున్నారు. పెట్టెలో ఇంకెవ్వరూ ప్రయాణీకులు లేరు. ఒకాయనకి బోరుకొట్టి రెండో ఆయన్ని పలకరించాడు.

"మీరు మద్రాసేనా వెళ్ళేది?"

"ఉహుం.. కాదు. ఇదివరకోసారి మద్రాసెళ్ళాను. నాకేం నచ్చలేదు."

మొదటాయన సిగరెట్ తీసి వెలిగిస్తూ రెండో ఆయనకి కూడ ఒకటివ్వబోయాడు

"ఉహుం.. ఇదివరకోసారి సిగరెట్ కాల్చాను. నాకు పడదు.."

మొదటాయన కాసేపాగి "మీరేమన్నా వ్యాపారం చేస్తున్నారా?" అని అడిగాడు.

"ఉహుం.. ఇదివరకోసారి వ్యాపారం చేశాను. నష్టం వచ్చింది.."

"కాసేప్పు పేకాడుకుందామా?" అడిగాడు మొదటాయన.

"ఉహుం.. ఇదివరకోసారి ఆడాను. నాకు అంతబాగా రాదు.."

"మీకు ఒక్కడే అబ్బాయనుకుంటాను.." హఠాత్తుగా, కసిగా అన్నాడు మొదటాయన!!

❀❀

**ఒకాయన** రెండో ఆట సినిమా నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళుతున్నాడు. సందులో చీకటిగా ఉంది. ఉన్నట్టుండి ఇద్దరు మనుషులు అతడ్ని ఆపారు.

"అయ్యా.. దయచేసి మీదగ్గర రూపాయి కాయిన్ ఉంటే ఇస్తారా?" అన్నాడు.

ఆ  పెద్దమనిషి కంగారు పడుతూ " ఇస్తాను గానీ ఏం చేస్తారు దానితో.?" అన్నాడు.

"అబ్బే మరేం లేదండి.. మాలో మాకు తగదా వచ్చింది. ఏదెవరు తీసుకోవాలా? అని. కాయిన్ ఎగరేస్తాం. బొమ్మపడితే మీ గడియారం వాడిది. ఉంగరం నాది. బొరుసు పడితే ఉంగరం వాడిది, గడియారం నాది. మీ డబ్బు సరే.. ఇద్దరం సమానంగా పంచుకుంటామనుకోండి.."

**"అదేమిటోయ్..** నీ జుట్టంతా అలా వూడిపోయింది?"
"ఆందోళన వల్ల"
"ఎందుకాందోళన?"
"జుట్టూడి పోతోందని.."

**ఒక ప్రసిద్ధ** చలనచిత్ర తార "నేను సినిమాల్లోకొచ్చి పదేళ్ళయింది. ఇప్పటికి తెలుసుకున్నాను, నేను సినిమాలకి పనికిరానని..!"
"ఐతే సినిమాల నుంచి విరమిద్దామనుకుంటున్నారా?" విలేకరి అడిగాడు.
""ఉహుఁ.. ఎలా తప్పుకోను? నేనిప్పుడు అరడజను సినిమాల్లో నటిస్తుంటేనూ..!?"

**ఇద్దరు తాగుబోతులు** రైలు పట్టాల మధ్యగా నడుస్తున్నారు.
ఒకడు: నా జన్మలో నేనెప్పుడూ ఇన్ని మెట్లెక్కలేదు.
ఇంకోడు: అది సరే.. మెట్లెక్కేప్పుడు పట్టుకోడానికి వీల్లేకుండా కడ్డీలు కూడా ఎంత కిందగా పెట్టారో చూడు...!

**ఇంకో ఇద్దరు** తాగుబోతులు పోయిన మనీపర్సుకోసం వెదుకుతున్నారు.
"ఉహుఁ.. ఈ గదిలో పర్సు పోలేదనుకుంటాను.."
"ఐతే.. పక్కగదిలో వెదుకుదాం.."
"పక్కన గది లేదుగా..!?"
"ఐతే గది కట్టించి మరీ వెదుకుదాం..!"

**అర్థరాత్రి వేళ** ఒకడు పూటుగా తాగి లాంతరు స్తంభం దగ్గర నిలబడి "తలుపు తియ్. నిన్నే తలుపుతియ్..." అంటున్నాడు.
ఆ దారిన పోతున్న ఇంకోతాగుబోతు "లాభం లేదోయ్.. ఇంట్లో ఎవరూ లేనట్టున్నారు." అన్నాడు.
"లేక పోవడమేమిటి? పైన లైటు వెలుగుతుంటే..?" అన్నాడు మొదటివాడు.

❀❀

"**ఇంత లేటుగా** ఇంటికి వెళితే మీ ఆవిడ ఏమీ అనదా?"
"నాకు పెళ్ళే కాలేదోయ్.."
"అయితే ఇంత పొద్దు పోయేదాకా ఇంటికెళ్ళకుండా తిరుగుతావేం..?"

❀❀

"**మీ రెండో నవలలో** కథ చాలా తమాషాగా ఉంది.. ఎక్కడన్నా కొట్టేసిన బాపతా!?"
" నా మొదటి నవల కథతో తీసిన సినిమా చూసి రెండో నవల రాశాను.."

❀❀

**ఒక పత్రికలో** "ప్రశ్నలు - సమాధానాలు" శీర్షికకు ఒకడు ఇలా వ్రాశాడు.
" నావయస్సు 19 ఏళ్ళు. మొన్నరాత్రి పొద్దుపోయి రెండింటికి ఇంటికి వచ్చాను. మా నాన్నగారు చివాట్లు పెట్టారు. నేను చేసిన తప్పేమిటో తెలియడం లేదు.."
సంపాదకుని సమాధానం "జ్ఞాపకం తెచ్చుకోండి.."

❀❀

**మేజిస్ట్రేటు:** "పోట్లాట జరుగుతున్నప్పుడు నువ్వక్కడే ఉన్నావు కదా. ఫిర్యాదికి ఎందుకు సహాయ, చెయ్యలేకపోయావ్..?"
సాక్షి: " ముందే ఎలా తలుస్తుందండి - ఎవరు ముద్దాయో, ఎవరు ఫిర్యాదో!?"

❀❀




## కామెడీ క్లబ్ కథలు

**మల్లాది వెంకటకృష్ణమూర్తి**

**తన తల్లితో** ఉండే ఓ కొడుకు తల్లి అభీష్టానికి వ్యతిరేకంగా ఓ అమ్మాయిని రహస్యంగా వివాహం చేసుకున్నాడు. తన భార్యని వేరే ఇంట్లో ఉంచి రోజూ ఏదో ఓ సమయంలో ఆమె దగ్గరకి వెళ్ళేవాడు. ఇలా రెండేళ్ళు గడిచాక రెండు ఇళ్ళు మెయిన్‌టెయిన్ చేయడం ఆర్థిక భారంగా ఉండీ అతను ఓ రోజు తన తల్లితో ఆ విషయం సాధ్యమైనంత మృదువుగా చెప్పదలచుకున్నాడు.

"అమ్మా! నీకు చెప్పకుండా నేనో పాడుపని చేశాను. రెండేళ్ళ క్రితమే నేను సరళని వివాహం చేసుకున్నాను. కొత్తపేటలో ఓ ఇంట్లో కాపురం చేస్తున్నాము. నాకో కొడుకు కూడా!"

అది విన్న తల్లి నిశ్చేష్టురాలైంది. కొద్ది క్షణాలాగి కోపంతో చెప్పింది..

నువ్వు ఎంత దుర్మార్గుడివిరా.. నీకు భార్య ఉండి కూడా ఇంతకాలం నీ బట్టలని నాచేత ఇస్త్రీ చేయిస్తున్నావా?"

## చొచొ... పెరుకొచ్చిన నవ్వులు

**"ఏమి** నాయనా.. రోజూ నా తపస్సును వీక్షించుచూ ఇక్కడే కూర్చుని యుంటివి? నా తపము నిన్ను అంతగా ఆకర్షించినదా?" బుచ్చిబాబుని అడిగాడు స్వామీ అభేద్యానంద.

"లేదు స్వామీ. మీ తపస్సుకు మెచ్చి భగవంతుడు ప్రత్యక్షమైతే నేను కూడా నాలుగు వరాలు కోరుకుందామని.." నసిగాడు బుచ్చిబాబు.

❀❀

**"డాక్టర్ గారూ..** మా వారికి జబ్బు బాగా ముదిరింది. ఎప్పుడు తీసుకురమ్మంటారు మీ దగ్గరకి?"

" ఫీజు రెండువేలు ముందుగా కట్టి వచ్చే మంగళవారం సాయంకాలం తీసుకురండి.."

"అబ్బో అన్ని రోజులా.. ఈ లోగా మావారి కేమైనా ఐతే..!?"

"ఏం ఫరవాలేదు.. మీ ఫీజు వాపస్ ఇచ్చేస్తాం.."

❀❀

**"నిన్న** నేనూ, నా గర్ల్ ఫ్రెండూ కలిసి బీచ్‌కెళ్ళాం, సినిమా కెళ్ళాం, రెస్టారెంట్ కెళ్ళాం.."

"అబ్బో.. ఎంత ఖర్చయిందేమిటి?"

"వెయ్యి రూపాయలు.."

"అంతేనా..?"

"ఏం చేద్దాం.. ఆమె దగ్గర అంతే ఉంది మరి.."

❀❀

**"మా అమ్మాయి** చాలా గారాబంగా పెరిగింది.. ఓ మంచి సంబధం చూసిపెట్టండి పెళ్ళిళ్ళ పేరయ్యగారూ.."

"తప్పని సరిగా నమ్మా.. ఎలాంటి సంబంధం కావాలీ..?"

"నెలకి పది పదిహేను సినిమాలు చూపించి, ఓ కలర్ టీవీ, ఏసీ, ఫ్రిడ్జూ, డాబుల్ కాట్.. ఇవన్నీ కొని ఓ కాసుల పేరూ, వడ్డాణం.. చేయించగలిగే స్తోమత ఉన్న అబ్బాయిని చూడండి..."

"అలాగేనమ్మా.. ఈ అబ్బాయి ఫోటో చూడండి.."

"బావున్నాడు.. ఏం చేస్తుంటాడేమిటి..?"

"పోలీసులకి దొరక్కుండా భారీ దొంగతనాలు చేస్తుంటాడు.."

ꕥꕥ

"**అయ్యా** ఎం.పీ గారూ.. మీరెప్పుడూ పార్లమెంట్ లో మాట్లాడినట్లు లేరు..!?"

"నేను అశేష మూగప్రజానీకానికి ప్రతినిధిని .. ఇంకేం మాట్లాడతానూ.."

ꕥꕥ

"**మొన్న** మారుతీకారు కొన్నావట గదా!?"

"అవునా.. నడుచుకుంటూ వెళ్తుంటే అప్పులాళ్ళు వెంటబడుతున్నారనీ.."

ꕥꕥ

"**అదేమిటోయ్...** కొత్తగా కట్టిన బిల్డింగు అమ్మేశావట గదా..?"

"ఏం చేసేదీ మరి.. అది కట్టించడానికైన అప్పులు తీర్చాలి గదా మరి.."

ꕥꕥ

"**సార్..** మా దొంగల ఫోటోలూ, వివరాలూ ఇస్తారా?" గజదొంగ గంగులు ఇన్స్పెక్టర్ ని అడిగాడు.

"ఎందుకూ.?" కుతూహలంగా అడిగాడు ఇన్స్పెక్టర్.

"మా అమ్మాయికి పెళ్ళి చేయాలి. మాంచి దొంగోడిని చూద్దామని.."

ꕥꕥ

**ఇద్దరు** తాగుబోతులు రోడ్డుమీద ఒకరికొకరు ఎదురుపడ్డారు..

"ఏమోయ్ నీపేరేమిషీ..?" అడిగాడు మొదటివాడు.

"తెల్వదు.."

చెప్పాడు రెండోవాడు..

"నైష్ నేమ్.." అన్నాడు మొదటివాడు తూలుతూ..

❀❀

**"మీరు** కొత్తగా పార్టీ పెట్టడానికి కారణం..?"

"మారడానికి మరో పార్టీ లేకపోవడమే.."

❀❀

**"అదేమిటి..** నేను వంట చేస్తున్నది సరిపోలేదా, వాడితో కూడా కూరలు తరిగిస్తున్నావు?" కొడుకుతో పనిచేయిస్తున్న భార్యని అడిగాడు రమణారెడ్డి.

"భలేవారేనండి.. రేపు వాడికి మాత్రం పెళ్ళి కాదా ఏమిటి?" సమాధానం చెప్పింది భార్య సూర్యాకాంతం.

❀❀

**"నేనెప్పుడూ** విమానం ఎక్కలేదు. ఒకవేళ ఆకాశం మధ్యలో విమానం ఆగిపోతే ఎలా..?"

"ఏముందీ.. అందరూ దిగి విమానాన్ని తొయ్యడమే.."

❀❀




## కామెడీ క్లబ్ కథలు — మల్లాది వెంకటకృష్ణమూర్తి

**ఓ కాలేజీ** హాస్టల్ లోని అబ్బాయిలు అర్ధరాత్రి బయట తిరిగి వస్తున్నారన్న ఫిర్యాదులు అందడంతో ఓ రాత్రి ఆ హాస్టల్ వార్డెన్ అర్ధరాత్రి హాస్టల్ ఆవరణలో కాపుకాశాడు. గోడదూకి లోపలకి వచ్చిన ఒకడు అతనికి పట్టుబడ్డాడు.

"ఎక్కడికి వెళ్ళివస్తున్నావు?" కోపంగా ప్రశ్నించాడు వార్డెన్.

"ఎక్కడికీ వెళ్ళి రాలేదు సార్! మన కాంపౌండ్ వాల్ ని బయట ఎవరో తవ్వుతున్న అలికిడి వినిపిస్తే వెళ్ళి చూసి వస్తున్నాను సార్. దొంగలెవరూ లేరు లెండీ.."

"అలా ఐతే నైట్‌డ్రెస్ లో వెళ్ళి ఉండాలి కదా.. ఈ షర్టు, ఫేంటు ఏమిటిమరి?"

"ఆడదొంగలేమోననిపించి, బావుండదని ఈ డ్రెస్ వేసుకుని వెళ్ళాను సార్.." తడుముకోకుండా చెప్పాడతను.

❀❀

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

**"బుడుగూ..!** ఆ పెన్సిల్ ఎక్కడ పడేశానో తొందరగా వెదుకు" మేస్టారు వెంగళప్పగారు ఆదేశించారు.

"అది మీ చెవిలోనే ఉందండీ.." బుడుగు చెప్పాడు.

"ఏ చెవో సరిగా చూసి చెప్పి ఏడవలేవూ..?" విసుక్కున్నారు వెంగళప్ప మేస్టారు.

❀❀

**ఓ పల్లెటూరమ్మాయి** చీరల దుకాణంలోకి వెళ్ళింది.

"ఆ నల్లగళ్ళ చీరె ఎంతబాబూ!?"

"వెయ్యి రూపాయలు..!"

"అయ్యబాబోయ్.. మరి ఆ పక్కన ఉన్న తెల్లగళ్ళ చీర?"

"మూడు అయ్యబాబోయ్ లు.."

❀❀

**"నిన్న పార్టీకి** వెళ్ళినప్పుడు ఎవరో పరిచయం లేని అబ్బాయి బుజం మీద చెయ్యి వేశాడు.." సీత చెప్పింది గీతతో.

"మరైతే చెయ్యి తియ్యమని గద్దించావా?" గీత అడిగింది.

"లేదు.. పరిచయం లేని అబ్బాయిలతో మాట్లాడవద్దని చెప్పింది మా అమ్మ!"

❀❀

**జడ్జిగారు** వాది చెప్పింది విని "పాయింటేనోయ్.." అన్నారు.

ఆ తర్వాత ప్రతివాది చెప్పింది విని.. " అవును.. ఇదీ పాయింటే.." అన్నారు జడ్జిగారు.

కోర్టు గుమాస్తా లేచి " అయ్యా ఇద్దరు చెప్పిందీ రైటెలా అవుతుందండీ..?" అన్నాడు.

" కదూ..నీదే పాయింటేనోయ్.." డిక్లేర్ చేశారు జడ్జిగారు.

❀❀

"**మా వారు** మహాభారతం వ్రాస్తున్నారు తెలుసా?" ఛాయాదేవి చెప్పింది.
"కొనుక్కుంటే పోలా? మళ్ళీ రాయడం దేనికి?" బదులిచ్చింది సూర్యకాంతం.

"**మీరేం భయపడకండి..** ఇది వరకూ నాకూ ఇలాంటి జబ్బే వచ్చింది" చెప్పాడు డాక్టర్ అయోమయం.
"నిజమే కావొచ్చు.. కానీ మీరు మంచి డాక్టర్ దగ్గరకి వెళ్ళి ఉంటారు కదా.." అనుమానం వ్యక్తపరిచాడు వెంగళప్ప.

"**అవును తెలుసా..** కొత్తగా మనవూరొచ్చిన ఆ పరబ్రహ్మంగారు అద్భుతంగా జ్యోతిష్యం చెబుతున్నారంట.."
" అవును నేను మొన్ననే వెళ్ళి వచ్చాను.."
"ఏం చెప్పారేమిటి?"
" ఇంకో వారం రోజుల్లో నా భార్యకు నీటిగండం ఉందని చెప్పాడు..."
" ఏమైందైతే..?"
" ఏమవుతుందీ.. నాకసలు పెళ్ళే కాలేదు.."

"**మీ అబ్బాయి** లారీ కింద పడ్డాడు.." మధ్యాహ్నం వచ్చిన ఫోన్ కాల్ విని, లాబ్‌లో వస్తువులన్నీ అక్కడే వదిలేసి హడావిడిగా బయలుదేరాడు ప్రొఫెసర్ అయోమయం.
ఎదురొచ్చిన సుందరం అడిగాడు.." ప్రొఫెసర్ గారూ. ఎక్కడికి హడవిడిగా వెళుతున్నారు?"
" మా అబ్బాయి లారి క్రింద పడిపోయాట్ట.."
" అదేమిటి సార్.. మీకింకా పెళ్ళే కాలేదు కదా..?"
" ఔను సుమీ.. నిజమే కదా!" వెనక్కి తిరిగారు ప్రొఫెసర్ అయోమయం.!

**ఒక ఊళ్ళో** గొప్పసభ జరుగుతోంది. ప్రారంభమవడానికి ఇంకా సమయం ఉంది. ఒక కుర్రాడు వెళ్ళి ముందు వరుసలో వి.ఐ.పి లకి కేటాయించిన సీట్లలో ఒక ఎమ్మెల్లేకీ, ఇంకో స్థానిక నాయకుడి మధ్యలో ఒక సీటు ఉంటే అందులో కూర్చున్నాడు.
ఆర్గనైజర్స్ వచ్చి కోపంతో " ఏయ్.. నువ్వు గాడిదవా.. దున్నపోతువా.. ఇక్కడ ఎందుకు కూర్చున్నావ్" అని అడిగారు.
"చిత్తం.. ఆ రెంటికి మధ్యలో కూర్చున్నానండీ.." చెప్పాడతను.!

❀❀

**పరమానందయ్య** శిష్యులు నలుగురు రాత్రి పూట కాగడా చేత్తో పట్టుకుని నది దాటుతున్నారు. కాగడా మంట నీళ్ళల్లో కనిపించడం చూసి వాళ్ళల్లో ఒకడు " అరేయ్.. నదికి నిప్పంటుకుందిరా.." అని పెద్దగా కేక పెట్టాడు.
"మరైతే చేపలన్నీ ఎక్కడికి వెళ్ళి ఉంటాయంటావ్?" ఇంకోడు అడిగాడు.
"నదిలో చేపలన్నీ చెట్లు ఎక్కాయిరా.." మూడోవాడు బదులిచ్చాడు.
వీళ్ళ మాటలు వింటున్న నాలుగో శిష్యుడు " ఒరేయ్.. మూర్ఖుల్లారా.. చేపలు ఎక్కడైనా చెట్లు ఎక్కుతాయిరా..? అవేమన్నా ఎడ్లు అనుకున్నారా..!?" అన్ని కేకలేశాడు.!

❀❀

**"ఏమయ్యా..** ఇంత వయసొచ్చింది.. టిక్కెట్ లేకుండా రైలు ఎక్కకూడదని తెలీదా?"
"టికెట్ కొన్నానండీ.. కాని ఆ పక్కాయన టికెట్ కొనలేదని బాధపడుతుంటే నాది అతనికి అమ్మేశానండీ.."

❀❀

**"ఇవాళ** వాళ్ళింట్లో పనిమనిషికి షష్టిపూర్తి.."
"ఆఁ..! అరవయ్యేళ్ళుగా పనిమనిషి అదే ఇంట్లో చేస్తోందా?"
"లేదు... వాళ్ళింట్లో ఈమె అరవయ్యవ పనిమనిషి.!"

❀❀

**ఆ వూళ్ళో** ఓ వానాకాలం వైద్యుడు రంగాచారి. చిన్న క్లినిక్ నడుపుకుంటున్నాడు. ఒకరోజు అర్జెంట్ కేసు వస్తే "అర్జెంట్ కేసు విషయం బయటికి వెళుతున్నాను. ఒక గంటలో వచ్చేస్తాను" అని చిట్టీవ్రాసి టేబిల్ మీద పెట్టివెళ్ళాడు. ఇంకా ఇంటికి రాలేదేమిటా అని వెతుక్కుంటూ వచ్చిన అతని భార్య ఆ చిట్టీ చదివి, ఆ దస్తూరి అర్థం కాక పక్కనున్న మెడికల్ షాపుకి తీసుకెళ్ళి చూడమని ఇచ్చింది.

మెడికల్ షాపులోని అబ్బాయి ఆ స్లిప్ ని రెండు మూడు సార్లు చదివి, ఒక మందు సీసాని ఆమె ముందుంచి " యాభై రూపాయలు దీని ఖరీదు" అన్నాడు.!!




## కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

**అయిదుగురు మిత్రులు** కలిసి అడవికి వేటకి వెళ్ళారు. నలుగురు కలిసి తాము వేటాడిన జింకని ఎత్తుకుని రెండుగంటల తర్వాత ఆనందంగా వచ్చారు.

"హరి ఏడీ?" అడిగాడు నలుగురే రావడం గమనించిన వాళ్ళ లీడర్.

"గుండెపోటు వచ్చి మరణించాడు. ఇక్కడికి నాలుగు మైళ్ళ దూరంలో ఉందతని శవం" చెప్పారు నలుగురు.

"మరైతే హరి శవాన్ని వదిలి ఈ జింకని తెచ్చారేమిటి?"

"ఆ మాత్రం తెలీదా? హరి శవాన్ని ఎవరన్నా దొంగిలిస్తారన్న భయం లేదు. కాబట్టి ముందు జింకని తెచ్చాం..!"

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

**ఒకాయన** అదే పనిగా మరో పెద్దమనిషికి ఉచితంగా ఉపన్యాసం ఇస్తున్నాడు

" ఈ రోజుల్లో ఎక్కడ చూసినా - లంచగొండితనం, కరువులూ, అవినీతీ, నిరాహారదీక్షలూ, నల్లధనం.. ఇంకా.. ఇంకా.."

అంవరకూ ఓపిగ్గా విన్న ఆ రెండో పెద్దమనిషి ఆ వాక్యాన్ని పూర్తిచేశాడు

" ఇంకా.. ఈ అతివాగుడు.. ఉచిత ఉపన్యసాలూ.."

❀❀

**" ఆ సుబ్బారావు** ఒట్టి వెధవోయ్.."

"అదేంటీ.. మొన్ననేగా మంచివాడన్నావు!?"

"అవును ఆప్పుడలాగే అన్నాను. మళ్ళీ ఇవ్వాళ ఓ వెయ్యిరూపాయలు అప్పు అడిగితే - లేదు పొమ్మన్నాడు.."

❀❀

**ఇండియాలో** మీరెన్ని సమస్యలతో సతమతమౌతున్నారని ఓ లండన్ జర్నలిస్ట్ నెహ్రూగారినడిగాడు. నెహ్రూగారి సమాధానం "నాలుగు వందల మిలియన్లు..!"

❀❀

**1931లో** గాంధీగారు రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్‌కి వెళ్ళినప్పుడు , ఆయన దుస్తుల గురించిన ప్రస్తావన వచ్చింది. దానికి గాంధీగారి సమాధానం " మీరు ప్లస్ నాలుగు ధరిస్తారు. మరి నేను మైనస్ నాలుగు ధరిస్తాను.. అంతే తేడా.."

❀❀

**"ఏమండోయ్..** నేను చెప్పేమాటలు జాగ్రత్తగా వినండి.. మొన్నరాత్రి రావాల్సిన మీరు నిన్న రాత్రి వచ్చారు. నిన్నరాత్రి రావాల్సి ఉంటే ఇవ్వాళ రాత్రి వచ్చారు. ఇవ్వాళ రావాల్సిన దానికి కనుక రేపు వస్తే ..ఇంకా నేనీ ఇంట్లో ఉండనంతే..!"

**డాక్టర్ :** మిమ్మల్నీ స్థాయికి తీసుకొచ్చింది ఆ పాడు విస్కీనే..!
దేవదాసు: ఇన్నాళ్ళకు మీరొక్కరే నన్నర్థం చేసుకున్నారు డాక్టర్ గారు. నా తప్పేమీ లేదనీ తప్పంతా విస్కీదే ననీ గుర్తించినందుకు చాలా చాలా ధన్యవాదాలు..!

**"బుడుగూ..** నీ అంత చిన్నవయసులో నేనెప్పుడూ అబద్ధాలాడలేదు తెలుసా?"
" మరైతే ఏ వయసునుంచీ అబద్ధాలాడ్డం మొదలెట్టారు నాన్నగారూ..!"

**" ఏమయ్యా** అప్పారావ్.. ఆ జంబులింగం నిన్నెప్పుడూ తిడుతూ ఉంటాడు.. అయినా నువ్వు అతన్ని మెచ్చుకోవడం విశేషమే..!"
"బహుశా మేమిద్దరమూ పొరబడుతున్నామనుకుంటున్నా.."

**తండ్రి:** అతనికేమైందమ్మా.. మూడు డిగ్రీలు ఉన్నాయి. అతన్ని పెళ్ళి చేసుకుంటే సుఖపడతావు..
కూతురు: నాన్నా.. డిగ్రీలే ప్రధాన మనుకుంటే మనింట్లో ఉన్న థర్మామీటర్ కి అంతకంటే ఎక్కువ డిగ్రీలున్నాయి...!

**ఒక పత్రికలో ప్రకటన:**

"మొన్న విజయవాడ - గుంటూరు బస్ లో నా కళ్ళజోడు వదిలేశాను. దొరికినవారు దయచేసి ఇదే పేపర్లో కాస్త పెద్ద అక్షరాలతో ప్రకటించ ప్రార్థన..!"

"జంబులింగం గారూ.. కొత్తకళ్ళజోడు పెట్టుకున్నారు కదా.. ఎలా ఉంది?"

"ఇదేంటి సార్.. ఈ రోడ్డు మీద ఇన్ని కార్లేమిటీ..ఇన్ని స్కూటర్లేమిటీ. ట్రాఫిక్ అంతా ఇంత స్పష్టంగా కనిపిస్తుంటే రోడ్డు దాటడమెలాగో తెలీక మతిపోతోంది..!"

" ఎప్పుడూ లేనిది గుళ్ళోకెళ్ళి వస్తున్నావు.. దేవుడ్ని ఏం కోరుకున్నావేమిటి?"

"మా ఆవిడకి గుండెజబ్బు.. పెద్దవాడు స్కూటర్ మీదనుంచి పడి కాలు విరగ్గొట్టుకున్నాడు. అప్పులవాళ్ళు కోర్టు నోటీసులు పంపించారు... ఈ కష్టాలన్నింటికీ అలవాటు పడిన ఈ సమయంలోనే ఇంకేమైనా కష్టాలు నాకోసం రాసిపెట్టి ఉంటే వాటిని కూడా వెంట వెంటనే పంపమని దేవుడ్ని కోరుకున్నాను..!"




## కామెడీ క్లబ్ కథలు

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

**తన భార్య** తనని ఎంతో ఆదరంతో, ప్రేమతో చూసుకోవడంతో, ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిన ఒకడు తన కృతజ్ఞతని తెలియచేసుకోడానికి దేముడికై తపస్సు చేశాడు. ఆయన ప్రత్యక్షం అవగానే తన థాంక్స్ తెలియచేసుకున్నాడు.

''ఆమెనెందుకు అంత దయగలదానిగ సృష్టించావు దేవా?'' ప్రశ్నించాడా భర్త.

''నిన్నే ప్రేమించాలని వత్సా..'' జవాబిచ్చాడు దేముడు.

''ఆమెనెందుకంత అందంగా సృష్టించావు?''

''అందువల్ల నువ్వు కూడా ఆమెని ప్రేమిస్తావని'' చిరునవ్వుతో జవాబిచ్చాడు దేముడు.

కొద్ది క్షణాలు ఆలోచించి అడిగాడు అతను.

''ఒక్క సంగతి నాకు బోధపడడంలేదు దేవా. ఆమెని ఎందుకంత అవివేకురాలిగా చేశావు? ఏమాత్రం కామన్ సెన్స్ లేని స్టుపిడ్ అది. ఎందుకని?''

''నిన్ను ఆమె ప్రేమించాలని వత్సా..'' జవాబు చెప్పి దేముడు మాయమయ్యాడు..!

## చౌచౌ... పేరుకొచ్చిన నవ్వులు

**"బుడుగూ..** మీ ఇంట్లో నువ్వు చదవని పుస్తకాలేమైనా ఉంటే ఇవ్వరా.."
"లేకేం.. నా క్లాసు పుస్తకాలు ఉన్నాయి.. తీసుకెళ్ళు.."

**"అదేమిటండీ..** పబ్లిక్ మీటింగ్ కి అలా లుంగీతో వచ్చేశారేమిటీ..?"
"మరీ.. ఇది కూడ లేకపోతే బావుండదనీ.."

**"జంబులింగం..** నిన్న మీ పక్క ఇంటివరకూ వచ్చానోయ్.. , మీ ఇంటికి రావడానికి సమయం సరిపోలేదు.."
" అలానా.. థాంక్ యు..!"

**ప్రొఫెసర్ పర్రబ్రహ్మం** నడుస్తూ లేబ్ కి వెళుతుంటే హఠాత్తుగా వర్షం పట్టుకుంది. నెత్తిమీద ఉన్న టోపీ తీసి జాగ్రత్తగా సంచీలో పెట్టుకుని అలా తడుస్తూనే లేబ్‌కి వెళ్ళారు. ఇది గమనించిన ఈ స్టూడెంట్ అడిగాడు..
"ప్రొఫెసర్ గారూ.. వర్షంలో తడుస్తూ వస్తున్నారేమిటి? ఆ టోపీ ఉంచుకోవాల్సింది.."
" ఆ టోపీ చాలా విలువైందయ్యా!" ప్రొఫెసర్ గారి సమాధానం.

**"ఏమిటీ జంబులింగం..** ఈ మధ్య అస్సలు కనిపించడం లేదు.. అంత బిజీనా?"
"ఆ.. బిజీనే.. వైజాగ్, విజయవాడ, గుంటూరు కోర్టులయ్యాయి.. ఇంక హైకోర్టుకి వెళుతున్నా.."
" అదేమిటీ అంత కాంప్లికేటెడ్ కేసులో ఇరుక్కునావా?"
"కాదు.. కోర్టు గోడలకి రంగులేసే కాంట్రాక్టు తీసుకున్నాన్లే.."

❀❀

**"ఐతే రోగలక్షణం** ఏమిటంటారు. సూర్యాకాంతం గారూ?" డాక్టర్ అడిగాడు.
"ఇంతకుముందు నీళ్ళ పంపుదగ్గర గంటల తరబడి దెబ్బలాడేదాన్ని. ఇప్పుడు పావుగంట కూడా పోట్లాడలేకపోతున్నా.. కారణం ఏమిటంటారు డాక్టర్?"

❀❀

**"ఆపరేషన్ సక్సెస్** అని చెప్పాను కదయ్యా.. ఐనా కళ్ళు కనిపించడం లేదంటావేమిటీ..? అసలేం జరిగింది..?"
"పక్కింటామె అనుకుని మా ఆవిడ చెయ్యి పట్టుకున్నాను డాక్టర్ గారూ.." ఘొల్లుమన్నాడు జంబులింగం..!

❀❀

**"బరువుతగ్గడానికి** గుర్రపుస్వారీ చెయ్యమని చెప్పారు కదా డాక్టర్?"
"అవును.. రెండునెలలైంది కదా.. ఏమైనా ఫలితం కనిపించిందా?"
"చాలా కనిపించిందండీ.. గుర్రం బరువు సగంపైగా తగ్గిపోయింది.."

❀❀

**"కాళ్ళల్లో ముళ్ళు** గుచ్చుకుంటున్నట్లు కలలొస్తున్నాయి డాక్టర్? ఏమైనా సలహా చెబుతారా?"
"చాలా సింపిల్.. పడుకోబోయే ముందు కాళ్ళకి చెప్పులేసుకుని పడుకోండి.."

❀❀

"**పొద్దున్నే లేవగానే..** నువ్వే గుర్తొస్తావు డార్లింగ్..." జంబులింగం ప్రేయసితో చెప్పాడు.

"అలానా. ఆ సోమలింగం కూడ అలాగే అంటాడు.."

"వాడి మొహం.. రేపటి నుంచీ వాడికంటే ముందుగానే లేస్తాను చూడు డియర్.."

❀❀

**కొత్త చెప్పులేసుకుని** వెళుతున్న లతని  ఇద్దరు అల్లరిక్కుర్రాళ్ళు ఆటపట్టించడం మొదలెట్టారు..

" మీ చెప్పులు భలే బావున్నాయండీ.."

"ఏం ..తీసి చూపించమంటారా?"

"భలే.. భలే... మీ డ్రెస్ ఇంకా బావుందండీ.."

❀❀

**గజలక్ష్మికి** బరువు చూసుకోవాలనిపించి రైల్వే స్టేషన్‌లో ఉన్న వెయింగ్ మెషీన్ ఎక్కింది..

రూపాయి బిళ్ళవెయ్యగానే అందులోంచి ఒక టిక్కెట్ వచ్చింది.దానిమీద ఇలా వ్రాసి ఉంది..

"దయచేసి ఈ మెషీన్ మీద ఒకేసారి ఇద్దరు ఎక్కకూడదు. పాడై పోయే ప్రమాదం ఉంది..!"

❀❀




## కామెడీ క్లబ్ కథలు

**మల్లాది వెంకటకృష్ణమూర్తి**

**'గొప్పవారు ఎవరు?'** అన్న అంశం మీద ముగ్గురు తమ తమ అభిప్రాయాలని ఇలా చెప్పారు. "గొప్పవాడెవడంటే, రాష్ట్రపతి భవన్ కి రాష్ట్రపతితో కలిసి టీ తీసుకోడానికి ఆహ్వానింపబడేవాడు.." మొదటివాడు చెప్పాడు.

"కాదు.. గొప్పవాడెవడంటే, రాష్ట్రపతి భవన్‌కి రాష్ట్రపతితో కలిసి టీ తీసుకోడానికి వెళ్ళినపుడు, రాష్ట్రపతికి అమెరికన్ ప్రెసిడెంట్ నుంచి ఫోన్ కాల్ వస్తే 'ఇప్పుడు కాదు, నాతో ఓ ముఖ్యమైన అతిథి ఉన్నారు' అని రాష్ట్రపతి అన్నప్పుడు" రెండోవాడు చెప్పాడు.

"కానే కాదు. గొప్పవాడెవడంటే , రాష్ట్రపతి భవన్ కి రాష్ట్రపతితో కలిసి టీ తీసుకోడానికి వెళ్ళినపుడు, అమెరికన్ ప్రెసిడెంట్ నుంచి ఫోన్ కాల్ వచ్చి రాష్ట్రపతితో అమెరికన్ ప్రెసిడెంట్ 'సార్.. ఇది మీ కోసం చెయ్యలేదు. మీ అతిథికి ఓసారి రిసీవర్ ఇస్తారా?' అని అడిగినప్పుడు.. వాడు గొప్పవాడు.." మూడోవాడు చెప్పాడు..!

## చౌచౌ... పెరుకొచ్చిన నవ్వులు

**"అవునూ..** మన జంబులింగం చేతివేళ్ళు తెగిపోయాయట.. పాపం! ఎందుకనీ?"

"పక్కింటి వాళ్ళ కుక్కకి ఎన్ని పళ్ళున్నాయో చూద్దామని దాని నోట్లో చెయ్యి పెట్టాడట..!"

"ఐతే?"

"ఏముందీ.. ఆ కుక్క ఈయన చేతికి ఎన్ని వేళ్ళున్నాయో చూద్దామని నోరుమూసుకుంది..!"

❀❀

**అర్జెంటుగా** వచ్చిన జంబులింగాన్ని సైకియాట్రిస్ట్ శోభనాద్రి అడిగాడు..

"ఇంతకీ మీ సమస్య ఏమిటీ..?"

"మా అమ్మాయి సంగీతం నేర్చుకుంటోంది. మా ఆవిడ కథలు వ్రాయడం మొదలుపెట్టింది.."

❀❀

**క్లాసులో** పిల్లలు తన మాట సరిగా వినడం లేదని మాస్టారు వాళ్ళని రెండు భాగాలుగా చేసి నిలుచోబెట్టారు.

"మీలో ఎడమ వైపు ఉన్నవాళ్ళంతా ఇడియట్స్, కుడివైపు ఉన్నవాళ్ళంతా రోగ్స్" అన్నారు మాస్టారు.

"సర్.. నేను ఇడియట్‌ని కాదు.." ఎడమవేపు నిలుచున్న ఆకాష్ గొంతెత్తి అరిచాడు.

"ఐతే ఎడమవేపు ఎందుకున్నావ్? కుడివైపుకి ఫో..!" ఇంకా గట్టిగా చెప్పారు మేష్టారు.!

❀❀

**తల్లి:** ఏరా .. ఏ వెధవని చూసి సిగరెట్లు కాల్చడం నేర్చుకున్నావ్?

కొడుకు: నాన్నను చూశే అమ్మా..!

❀❀

**జంబులింగం,** అతని భార్య పోట్లాడుకుంటున్నారు. అంతలో వాకిట్లోకి ఓ గాడిద వచ్చి ఓండ్రపెట్టడం మొదలెట్టింది.

" అదుగో.. మీ చుట్టాలెవరో వచ్చినట్లున్నారు.. నిన్ను పిలుస్తున్నారు.." ఎకసక్కెంగా అన్నాడు జంబులింగం.!

"అవును.. పెళ్ళయ్యాక ఏర్పడ్డ చుట్టాలే వచ్చింది.." గడుసుగా జవాబిచ్చింది భార్య!

❀❀

**ఓ అటవీఅధికారి** ఆఫీసులో ఉన్నప్పుడు జవాన్ హడవిడిగా పరుగెత్తుకొచ్చాడు.

"సార్! సార్! ఓ పులి మీ ఇంట్లోకి వెళ్ళి మీ ఆవిడ మీదకు దూకింది. త్వరగా రండి సార్..వెళ్దాం.."

"ఆఁ.. ఏం వెళ్ళటం లేవోయ్.." అన్నాడు అధికారి నిర్లక్ష్యంగా!

"అదేమిటండీ.. అలా అంటారు.. అక్కడ ఒక ప్రాణం పోతుంటే.."

"ప్రాణమా..!? పోతే పోనీవయ్యా.. ఆ పులి చస్తే మనదేం పోయిందీ..!?"

❀❀

**"ఏమిటండీ..** మీఊ సమస్య?" డాక్టర్ అడిగాడు..

"ఎందుకో.. ఉన్నట్టుండి.. ప్రాణాలు తీసేసుకోవలనిపిస్తుంది.. డాక్టర్!"

'మీరేం అధైర్యపడకండి.. ఆ విషయం నా కొదిలేయండి.."

❀❀

**"జంబులింగం గారూ..** ఈ విషయం మీతో చెప్పాలంటే నాకే ఏమిటోగా ఉందండీ.. మీరు ఫీజు కింద ఇచ్చిన చెక్కు తిరిగొచ్చింది.." చెప్పలేక చెప్పాడు డాక్టర్..

"అలానా..! భలే విచిత్రంగా ఉందండీ. మీరు నయం చేశానన్న నా జబ్బు కూడా అలానే తొరిగిచ్చేసింది..!" అమాయకంగా అన్నాడు జంబులింగం.

❀❀

**రోడ్డు మధ్యలో** నిలబడ్డ ఓ తాగుబోతుని పోలీసు అడిగాడు.

"ఏమయ్యా... అలా రోడ్డు మధ్యలో నిలబడ్డావేమిటి?"

"అయ్యా..! నా కళ్ళముందు ప్రతిదీ పరిగెత్తి వస్తున్నట్లూ, తిరుగుతున్నట్లూ కనిపిస్తోంది. నా ఇల్లు కూడా కనపడుతుందేమో వెళ్దాం అని చూస్తున్నా!"

❀❀

**ఓ రాజకీయవేత్త** ఉపన్యాసం..

"ఆత్మహత్య మహాపాపం.. ఆత్మహత్యలు దేశంలో లేకుండా చేస్తే దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతుంది. మా పార్టీ అధికారం లోకి వస్తే ఆత్మహత్యలని నిర్మూలిస్తుంది.."

"ఎలాగండీ?" అడిగాడో ప్రేక్షకుడు.

"మా పార్టీ అధికారంలోకి రాగానే ఆత్మహత్యచేసుకున్న ప్రతివ్యక్తికీ మరణశిక్ష అమలుచేస్తామని చట్టం తీసుకొస్తాం. దాంతో భయపడి ఎవ్వరూ ఆత్మహత్య చేసుకోరు.."

❀❀

**ఓ పత్రికా ప్రకటన:**

" మంచి ఆల్సేషియన్ కుక్క అమ్మకానికి ఉంది. ధర సరసం. ఆహారం విషయంలో ఇబ్బంది లేదు. ఏదైనా తింటుంది. చిన్న పిల్లలంటే చాలా ఇష్టం..!"

❀❀

**జంబులింగం** ఆఫీసునుంచి ఇంటికి ఫోన్ చేశాడు.

"ఏమోయ్ కొత్త సినిమాకి రెండు టిక్కెట్లు బుక్ చేశాను.."

"అబ్బ..! అలాగాండీ.. అయితే ఇప్పుడే తయారవడం మొదలుపెడతాను.."

" ఓ..అలాగైతే ఖచ్చితంగా సినిమా టైముకి అందుకోగలం.. అన్నట్లు.. సినిమా టిక్కెట్లు రేపు మేట్నీకి లే...!"

❀❀




## కామెడీ క్లబ్ కథలు                మల్లాది వెంకటకృష్ణమూర్తి

**కాశీలోని** ఒక ముసలిపండితుడు మరణశయ్యమీద ఉన్నాడు. తను ఆ రోజు పోతానని తెలియగానే కొడుకుని పిలిపించి ఓ పెన్నూ, కాగితం తీసుకురమ్మన్నాడు. అది రాగానే ఆ కాగితం మీద ఏదో రాసి "నా చితి మీద దీన్ని కూడా ఉంచి కాల్చండి." అని చెప్పాడు.
ఆ కాగితంలో ఏం రాసి ఉందో చదివాడా కొడుకు.

అందులో "పండిత పరమేశ్వర శాస్త్రి, ఇండియన్ సిటిజన్" అని రాసి ఉంది.

ఆ కొడుకు ఆశ్చర్యంగా అడిగాడు తండ్రిని.
"మరణించాక యమదూతలకి నువ్వెవరో ఎందుకు తెలియాలి?"

"ఎందుకంటే ఒకవేళ నన్ను వాళ్ళు నరకానికి తీసుకెళ్ళే పక్షంలో ఇండియన్ సెక్షన్ కి తీసుకెళ్తారని"

"నిన్ను ఇండియన్ సెక్షన్ కే ఎందుకు తీసుకెళ్ళాలి నాన్నా?" అడిగాడా కొడుకు తండ్రిని ఆసక్తిగా.
"ఎందుకంటే అక్కడా కిరసనాయిల్, పెట్రోలు ప్రియం.. నూనె ఐతే అస్సలే దొరకదు కాబట్టి" చెప్పాడు శాస్త్రి.

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

పాఠకుల ప్రశ్నలకి డాక్టర్ అతితెలివిగారి సమాధానాలు

***స్మశానం చుట్టూ కంచె కట్టడం సరైన పనేనా?***

లేదునాయనా.. అదిచాలా తెలివితక్కువ పని. ఎందుకంటే బయట ఉన్నవాళ్ళెవరూ లోపలకి వెళ్ళాలనుకోరు. లోపల ఉన్నవాళ్ళు ఎలానూ బయటికి రాలేరు..!

***ప్రతీకారం అంటే?***

మనల్ని కరిచిన కుక్కని మళ్ళీ మనం కరవడం.

***కొంతమంది సినిమా తారలు దేవాలయాల్లో కూడా నల్లకళ్ళజోడు పెట్టుకుంటారెందుకు?***

దేవుడు తమల్ని గుర్తుపట్టి ఆటోగ్రాఫ్ అడుగుతాడేమోనని.

***ప్రొఫెసర్ అంటే?***

ఏమీ లేనిదాని గురించి ఎంతో ఎక్కువగా తెలుసుకున్నవాడు

**ఒక సభలో** ఒకాయన మాట్లాడుతుండగా జనం సభనుంచి ఒక్కొక్కరే బయటికి వెళ్ళిపోయారు. చివరికి ఒక్క శ్రోత మాత్రమే మిగిలాడు.

"చాలా ధన్యవాదాలు మహాశయా.. నా ఉపన్యాసం మీద శ్రద్ధ ఉంది మీకొక్కరికే.." అన్నాడాయన.

"శ్రద్ధా లేదు.. నా శ్రాద్ధం లేదు.. మీ తర్వాత మాట్లాడాల్సింది నేనే.." విసుక్కుంటూ చెప్పాడతను.

"**ఏ టాపిక్** మీదనైనా గంటసేపు అనర్గళంగా మాట్లాడగలను.. తెలుసా?"

"నేనైతే ఏ టాపిక్ లేకపోయినా రెండు గంటలు మాట్లాడగలను..!!"

**ఇద్దరు మిత్రులు** అడవిలో వేటకి వెళ్ళారు. వాళ్ళని చూసి పులి పారిపోయింది. ఒకడు రెండోవాడితో అన్నాడు..

"నువ్వు పులి ఎక్కడికి వెళ్ళిందో చూడు.. నేను అది ఎక్కడినుంచీ వచ్చిందో చూస్తాను.."

**కొత్తగా పెళ్ళయిన వధువుతో** ఒక ముత్తయిదువ ఇలా అంది..

"అమ్మాయ్! నీ భర్తను మొదటి నుంచి అదుపులో పెట్టుకో. నేనైతే మా ఆయన్ని సిగరెట్టు తాగొద్దని చెప్పేశాను.."

"ఐతే పూర్తిగా మానేశారా ఆయన?"

"ఏమో నమ్మా.. ఆయన అప్పటినుంచి కనబడ్డం లేదు మరి." విచారంగా చెప్పింది ముత్తయిదువ.

**బుడుగు** తన మిత్రుడితో చెబుతున్నాడు..

"ఏమిటోరా మా ఇంట్లో అందరూ బంధువులనే పెళ్ళి చేసుకుంటున్నారు.. ఎలాగంటే మా నాన్న మా అమ్మను పెండ్లాడాడు. మా తాత మా అమ్మమ్మను పెండ్లాడాడు. మా అత్తయ్యను మా మామయ్య పెళ్ళిచేసుకున్నాడు. మా అన్నయ్య మా వదిన్ని పెళ్ళి చేసుకున్నాడు..!"

**"ఈ హోటల్లో** ఒక దోసె తిన్నవాళ్ళకి ఒక వడ ఉచితం.. తెలుసా?"

"అలాగా..!? ఎందుకబ్బా?"

"ఫాన్ గాలికి దోసె ఎగిరిపోకుండా ఉండడానికి..!"

**"అవును** సూర్యాకాంతం గారూ.. మీ వారు ఇంతకుముందు నల్లగా ఉండేవారు. ఇప్పుడు తెల్లగా ఉంటున్నారెందుకని?"

"ఏం లేదమ్మా.. ఇంతకుముందు బొగ్గుల వ్యాపారం చేసేవారు.. ఇప్పుడు పిండిమర వ్యాపారంలోకి దిగారు..!"

"**డాక్టర్ గారూ**.. ఈ మధ్య కళ్ళు సరిగా కనిపించడం లేదండీ.."
" ఐతే మీరు వెళ్ళాల్సింది కళ్ళ ఆసుపత్రికి .. ఇది కిరాణా కొట్టు..."

"**అయితే** నిన్ను నేను ప్రేమించకపోతే నిజంగానే చచ్చిపోతావా గోపీ?" మాధురీ దీక్షిత్ అడిగింది.
"అవును మాధురీ.. నేను మాటమీద నిలబడేవాడిని. ఇంతకుముందు లలిత, శాంతి, రాధలకి కూడా ఇలానే చెప్పాను.."

**జంబులింగం** తన డబ్బునంతా దొంగలు దోచుకున్నారని పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు ఇచ్చాడు.
ఇన్‌స్పెక్టర్ అడిగాడు..
" మీ దగ్గర రివాల్వర్ ఉందిగా.. దాన్ని చూపించి దొంగల్ని భయపెట్టలేకపోయారా?"
"అన్నీ పోయాయి.. దీన్ని ఒక్కదాన్నయినా దక్కించుకుందామని వాళ్ళ కంటపడకుండా రివాల్వర్ దాచేశాను..!"

" **అయితే** జంబులింగం గారూ.. ఇంతకీ మీ వ్యాధి లక్షణాలేమిటీ..?" డాక్టర్ అడిగాడు.
"అన్నం తిన్న తర్వాత ఆకలి కావడంలేదు డాక్టర్..!"




## కామెడీ క్లబ్ కథలు

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

**తమ నగల షాపులో** దొంగతనం జరిగిందని, పోలీస్ రిపోర్ట్ ఇచ్చాడు  జంబులింగం. వాళ్ళు విచారణకి వచ్చారు.

"దొంగతనం ఎలా జరిగింది?"

"ఒక ఏనుగు ఆ దొంగతనం చేసింది."

"ఏనుగు దొంగతనం చేసిందా?"

"అవునండీ.. ఏనుగే! పెద్ద ట్రక్ లోంచి రాడ్ లతో షో కేసుని పగలకొట్టి, నగలన్నిటినీ తీసుకొని మళ్ళీ ట్రక్ ఎక్కి వెళ్ళిపోయింది" చెప్పాడు జంబులింగం.

"అది ఏ దేశం నుంచి వచ్చిందో తెలిస్తే బెటర్. చిన్న చెవుల ఏనుగు ఐతే ఇండియాకి చెందింది. పెద్ద చెవుల ఏనుగైతేఆఫ్రికా దేశానికి చెందింది. దాని చెవులెలా ఉన్నాయి?" ప్రశ్నించాడు ఇన్స్పెక్టర్.

"నాకేం తెలుసు? దాని మొహానికో ముసుగుంది" చెప్పాడు జంబులింగం!

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

**"ఏమండీ..** ఆ రాజారావు ఇందాక పోట్లాడుతూ... 'నీ బుర్రలో ఏమైనా ఉందా?' అన్నాడు కదా..మీరు మౌనంగా ఉండిపోయారేం?"

"మరి.. ఏం చెప్పమంటావేమిటి?" జంబులింగం అడిగాడు భార్యని.

"మెదడు ఉందని చెప్పొచ్చు కదా.."

"ఎలా చెప్పేది, డాక్టర్ తో పరీక్షచేయించుకోకుండా!" విసుగ్గా అన్నాడు జంబులింగం.

**"జంబులింగం గారూ..** జ్వరం చాలా తీవ్రంగా ఉంది. మీరు రెండు పూటలా భోజనం మానెయ్యాలి.."

డాక్టర్ సలహా ఇచ్చాడు.

"ఐతే మిగతా రెండు పూటలూ తినొచ్చాండీ..?" అమాయకంగా అడిగాడు జంబులింగం.

**కిరణాకొట్టు** వ్యాపారిని కోర్టులో విచారిస్తున్నాడు జడ్జి.

"ఏమయ్యా.. మీ కొట్టులో అన్నీ కల్తీ సామానులే అమ్ముతున్నారని ఫిర్యాదు వచ్చింది. నువ్వేం సమాధానం చెబుతావు?"

"నేనేం చేసినా వినియోగదారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకునే చేస్తున్నానండీ.. ఉదాహరణకి నూనెలో ఆముదం కలుపుతున్నా. ఆముదం అజీర్ణాన్ని తొలగిస్తుంది. బియ్యంలో తౌడు కలుపుతాము.. తౌడు మనిషికి పుష్టినిస్తోంది., గోధుమపిండిలో బియ్యం పిండి కూడా ఆరోగ్యానికి మంచిదే కదండీ.."

**డైరెక్టర్** తన సినిమాలోని కొత్త హీరోతో చెప్పాడు.. "చూడండీ.. ఇప్పుడు ఈ కొండమీద నుంచి నదిలోకి తోసేస్తారు విలన్ అనుచరులు. మీరు ఈదుకుని ఒడ్డుకి చేరుకోవాలి.."

"నాకు ఈత రాదు కదండీ.." చెప్పాడు హీరో.

"మీకు ఈత రాకపోయినా ఫరవాలేదండీ... జస్ట్ యాక్షన్ చేస్తే చాలు..!" చాలా తేలిగ్గా చెప్పాడు దర్శకుడు.

**ఒక వ్యాపారస్తుడు,** తన పాత స్నేహితుడిని చాలా సంవత్సరాల తర్వాత కలుసుకున్నాడు.

"ఏం చేస్తున్నావురా..?"

"కథలు వ్రాస్తున్నా.."

"పత్రికల్లో వస్తున్నాయా?"

"లేదు నేనే అచ్చువేస్తున్నా.."

"అమ్మకాలు ఎలా ఉన్నాయి..?"

"బాగానే ఉన్నాయి.. ఇంతవరకూ ఇంట్లో ఉన్న ఫ్రిజ్, టివి, డబుల్ కాట్ అమ్మేశాను.. తర్వాత పుస్తకం అచ్చువేయడానికి ఏం అమ్ముదామా అని ఆలోచిస్తున్నా.."

**భార్యమీద** అనుమానంతో అరిచాడు జంబులింగం.. "మహా పతివ్రతలా మాట్లాడమాకు.. నాకీ అన్నీ తెలుసు.."

"దబాయించకండి.. అన్నీ తెలిస్తే వాటర్ లూ యుద్ధం ఎప్పుడు జరిగిందో చెప్పండి.." భార్య ప్రశ్నకి ఏం సమాధానం చెప్పాలో తెలియక బుర్ర గోక్కున్నాడు జంబులింగం..!

**జంబులింగం** కొడుకు బుడుగుని అడిగాడు.. "అరే మీ క్లాసులో అత్యంత సోమరి ఎవరో తెలుసా..?"

"ఊఁ.. తెలీదునాన్నా.."

"అదేరా.. మీ క్లాసులో పిల్లలంతా చదువుకుంటుంటేనూ, వ్రాసుకుంటుంటేనూ ఊరికే చూస్తూ కూర్చునే దెవరు?"

" మా మేష్టారు... నాన్నా.."

**"నాన్నా..** ఒక సందేహం.." బుడుగు అడిగాడు.

"ఏమిటీ..?" తండ్రి జంబులింగం అడిగాడు.

"ఒక విడి ఈగ 8000 గుడ్లు పెడుతుందని ఈ పుస్తకంలో వ్రాసి ఉంది.."

"అయితే?"

"ఐతే మరి పెళ్ళి చేసుకున్నా ఈగ ఎన్ని గుడ్లు పెడుతుందో..!?"

**ఒక సిపాయి** "భాయ్.. సైన్యంలో ఎందుకోసం చేరావు?"
"నాకు పెళ్ళి కాలేదు. పిల్లా  జెల్లా లేరు.. యుద్ధమంటే ఇష్టం.. అందుకే చేరాను.. మరి నువ్వో...?"
"నాకు పెళ్ళయింది.. అందుకే ఇక్కడికి వచ్చేశాను..!"

**సంగీతం** మాస్టారు అడిగాడు.." ఒరేయ్. గాడిద అరుపు ఎలా ఉంటుంది?"
"మీరు సంగీతం పాఠాలు చెబుతున్నప్పుడు పాడుతారే.. అలా ఉంటుంది.. సార్!" కొంటె శిష్యుడి తుంటరి సమాధానం.

**"స్నానం** చేయాలంటే నీళ్ళు చల్లగా ఉన్నాయి.. ఎలాగబ్బా?"
"ఏముందీ .. స్వెటర్ వేసుకుని చేస్తే సరి.."

**"ఏరా** బుడుగూ.. ఎందుకు ఏడుస్తున్నావ్?"
"మా నాన్న మా అమ్మని సిగ్గులేని కుక్క అన్నాడు"
"తర్వాత?"
" మా అమ్మ మా నాన్నను బుద్ధిలేని గాడిద అంది.."
"ఐతే నువ్వెందుకు ఏడవడం?"
"ఇంతకీ నేనెవర్నో తెలీక..!"




## కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

**ఓ ఎనభై** అయిదేళ్ళ ముసలాయన పార్క్‌లో కూర్చుని ఏడుస్తూండటం చూసి ఒకరడిగారు.

"దేనికి ఏడుస్తున్నారు?"

"వారం క్రిందట నాకు ఇరవయ్యేళ్ళ టి.వి. యాంకర్ గర్ల్ తో వివాహమయ్యింది. హనీమూన్ కి కూడా వెళ్ళొచ్చాం. మా మధ్య దాంపత్య జీవితం అద్భుతంగా ఉంది కూడా.. పది నిమిషాల క్రిందటే పార్క్ కి వచ్చాను.."

"మరి ఏడుపు దేనికి?"

"మా ఇల్లెక్కడో గుర్తుకు రావడం లేదు.."

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

" **తాగుబోతు** కూడా విస్కీ సీసాలాంటి వాడే."
"ఎందువల్ల?"
"సీసాకి మెడ, పొట్టా ఉంటాయి. కానీ తల మాత్రం ఉండదు.."

❀❀

"**ఒకసారి** నేను ఎడారిలో నడిచిపోతున్నాను. మిట్ట మధ్యాహ్నం ఎండ మండిపోతున్నది. దరిదాపుల్లో ఎక్కడా నీడకోసం ఒక్క చెట్టుగానీ, పొదగానీ. గుట్టగానీ లేవు" సాహస యాత్రికుడు తన అనుభవాలని స్నేహితులకి చెబుతున్నాడు.
"అప్పుడేం చేశావు మరి..?" ఆదుర్దాగా అడిగాడో మిత్రుడు.
"ఏం చేస్తాను.. నా నీడలో నేనే కూర్చున్నాను.."

❀❀

"**డాక్టర్..** మనిషి మీదుగా కారు పోయిందనుకోండి.. అప్పుడేం చెయ్యాలి...?"
"కారు నెంబరు నోట్ చెయ్యాలి.."

❀❀

"**పిచ్చేశ్వరరావు గారూ...** ఇప్పుడే మీ ఆవిడ ఓ పాపని ప్రసవించింది. కానీ పాప బరువు ఒక పౌను మాత్రమే ఉంది. నాకు భయంగా ఉంది మరి." చెప్పింది లేడీ డాక్టర్.
"ఇందులో భయపడాల్సిందీ, ఆశ్చర్యపోవాల్సింది ఏమీలేదు. పాప అంతకన్నా ఎక్కువ బరువెలా ఉంటుంది మరి.. మా పెళ్ళయి నెల రోజులే గదా అయ్యింది.." అన్నాడా పిచ్చేశ్వరరావు.

❀❀

**"నువ్వెందుకు** అడుక్కుంటున్నావు?"
"తాగడానికి"
"తాగడమెందుకు?"
"అడుక్కునే ధైర్యం కోసం.."

❀❀

**"గర్ల్ ఫ్రెండ్‌కి, భార్యకి** ఉన్న తేడా ఏమిటి?"
"బార్ కూ, కాఫీ హోటల్ కూ ఉన్న తేడా.."

❀❀

**"కష్టమైనా,** సుఖమైనా ముఖాన చిరునవ్వును మాత్రం తొలగిపోనివ్వకూడదు అని లోగడ నీకు చెప్పాను . గుర్తుందా?"
"అవునండీ.."
"నా సలహా నీకెలా ఉపకరించింది మరి.!?"
" మా ఆఫీసరు ఇప్పటికి పదిసార్లు , అలా ఇకిలించడం మానేసి నోరుమూసుకుని సీరియస్‌గా పని చేసుకో .. ఫో.. అని గదిమాడు సార్."

❀❀

**భర్త:** నేను మనసు మార్చుకున్నాను
భార్య: బ్రతికించారు. ఇంతకీ ఇప్పుడైనా అది సరిగా పనిచేస్తోందా?

❀❀

**ప్రొఫెసర్:** మద్యం , మగువ వీటిలో మనిషి దేన్ని వదిలి పెట్టవచ్చు?
స్టూడెంట్: అసలు దేన్నైనా వదిలి పెట్టడమెందుకు?

❀❀

**డాక్టర్:** ప్రస్తుతం మీ ఆరోగ్యం ఎలా ఉంది?
పేషెంట్: దాదాపు అన్నీ నయమై పోయినట్లే డాక్టర్. అన్ని నొప్పులూ బాగా తగ్గిపోయాయి. కానీ శ్వాస పీల్చే విషయంలోనే కొంచెం బాధగా ఉంది.
డాక్టర్: తతిమ్మా నొప్పులన్నీ రాకుండా ఆపేసిన వాడిని, మీ శ్వాసమాత్రం ఆపెయ్యలేనా? దిగులు పడకండి..

❀❀

**ప్రతిరోజూ** సరిగ్గ మధ్యాహ్నం 11.30 గంటలకి టెలిఫోబ్ ఆపరేటర్ కి ఫోన్ వస్తుంటుంది. "టైమెంతైంది మేడమ్?" అని.
ఓ రోజు ఉత్సుకతను ఆపుకోలేక ఆమె అతన్నడిగింది "రోజూ ఎందుకిలా అడుగుతున్నారు?" అని.
"నేను మిల్లులో పనిచేసే ఫోర్ మేన్ని. అందుకే నా టైమ్ సరైనదో కాదో తెలుసుకుందామని.." అన్నాడు.
"భలే. ఉందే మీరు ఫోన్ చేసిన టైముకి సరిగ్గా 11.30 అని మేమే మా గడియారాలు సరిచేసుకుంటున్నాం" అంది ఆపరేటర్.

❀❀

**"మీ** ఆయన హాబీ ఏమిటి?"
"ఆడపిల్లల వెంట పడటం"
"అదేమిటీ.. మరి నీకు ఇబ్బందిగా లేదా?"
"ఏ మాత్రం లేదు."
"ఆశ్చర్యం..!"
"ఆశ్చర్యానికేముంది. కుక్కలు కార్లవెంట పరుగెత్తుతాయి. ఒక వేళ అవి కారుని అందుకోగలిగినా కారుని నడపలేవు కదా..!"

❀❀